
# ముదిమికి ముచ్చట్లు లావు

పాలకోడేటి కృష్ణమూర్తి



ఈవినింగ్ వాక్ చేసి ఇంటికొచ్చేసరికి సాయంత్రం ఏడు గంటలయింది. ఇంట్లో నా శ్రీమతి మా అమ్మాయి టీవీలో సీరియల్ చూడ్డంలో మునిగిపోయ్యారు. ఒక్క సీరియల్సే కాదు వాటితోపాటు వచ్చే ప్రకటనలు, విజ్ఞాపనలు కూడా చాలా ఆసక్తిగా చూస్తారు. నన్ను చూసి ''ఈయనకి చెప్పి వేస్ట్'' అంటూ గొణుక్కుంది శ్రీమతి. ఆ సమయంలో టీవీలో హెయిర్ డైకి చెందిన ప్రకటన వెలువడుతోంది.

''ఏంటి నీలో నువ్వే గొణుక్కుంటున్నావు'' అన్నాను.

''అటు చూడండి. ఆ హెయిర్‌డై వేసుకుంటే మీరు స్మార్ట్‌గా కనబడతారు. జుట్టంతా తెల్లబడి కొబ్బరిపీచులా తయారయ్యింది. డై చేసుకోండి అంటూ ఎన్నో సార్లు మొత్తుకున్నాను. మీరేమో ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తారు'' అంది కళ్లు పెద్దవిగా చేస్తూ.

''ఇప్పుడైతే వెంట్రుకలే తెల్లబడ్డాయి. కొంత కాలం తర్వాత పళ్లూడిపోతాయి. మరి కొన్నిరోజులు పోతే కర్రపూతం ఆసరా అవుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఇవన్నీ సహజమే కదా. ఆర్టిఫిషియల్‌గా ఉండడమంటే నాకు చిరాకు. నా తల బోర్లించిన మూకుడులా తయార

యితే నువ్వు చూడలేవు'' అన్నాను.

ఇంతలో ప్రకటనలు పోయి సీరియల్ రాసాగింది. వెంటనే నా శ్రీమతి ''చూడండి... అటు చూడండి. ఆ వేషం వేసినాయనకి అరవై ఐదేళ్ళ పైమాటే. ఎంత స్మార్ట్‌గా కనిపిస్తున్నాడో. మీరూ వున్నారు. ఎందుకు. మొన్ననే ఏభై ఎనిమిది సంవత్సరాలు నిండి రిటైరయ్యారు. అరవై కూడా ఇంకా నిండలేదు. అప్పుడే తాతయ్యలాగా అయిపోయారు. మీ పక్కన నడుస్తుంటే నాకు సిగ్గుగా వుంటోంది. నేను మీకు రెండో పెళ్లాన్నేమోనని మన కాలనీకి కొత్తగా వచ్చినవాళ్ల సందేహం. మీరు ఇహ మారకపోతే చాలా కష్టం'' బాధపడుతున్నట్టుగా అంది శ్రీమతి.

''అందుకు నన్నేం చేయమంటావు'' అడిగాను.


''ఏం చేయమంటారేంటి. అదిగో సీరియల్‌లో ఆయన్ని చూడండి. ఆయనకి డెబ్బై అయిదు సంవత్సరాలకి తక్కువుండదు. ఆయనే వేసుకున్న కుర్తా పైజామా ఎంత బాగున్నాయో. వాటిని ధరించడం వల్ల ఆయనకి ఎంత అందమొచ్చిందో చూశారా. ఈరోజుల్లో యువకుల దగ్గర్నుంచి ముసలాళ్ల వరకు వేల రూపాయలు ఖరీదు చేసే కుర్తా పైజామాలు, బిగువైన దుస్తులు ధరిస్తున్నారు. జీవితమంటే వాళ్లదే. మీరూ వున్నారు. ఎందుకు? ఎప్పుడు చూసినా మామూలు ప్యాంటు, షర్టు తప్ప వేరేవీ తొడిగిన పాపాన పోలేదు. 'పండగరోజు కూడా పాత మొగుడేనా' అన్నట్టు పండగొచ్చినా పబ్బం వచ్చినా అవే కాటన్ ప్యాంటు షర్టు తప్ప అందరిలా మనం కూడా ఖరీదైన బట్టలు వేసుకుని అందరిలోనూ ప్రత్యేకంగా కనబడదామనే ధ్యాస లేదు మీకు'' అంది నా వంక గుర్రుగా చూస్తూ. కొంచెం విరామం తర్వాత ''అసలు టీవీ సీరియల్స్‌లోని ఆర్టిస్టులు బట్టలు ఎక్కడ కొంటారో తెలుసుకోండి ముందు'' అంది.


ఇంతలో మా అమ్మాయి రిమోట్ లాక్కుని ఛానల్ మార్చింది. ఈసారి టీవీ స్క్రీన్ మీద బ్రహ్మానందం కనబడ్డాడు. వెంటనే మా ఆవిడ ''అదిగో బ్రహ్మానందం. ఎంత స్మార్ట్‌గా వున్నాడో బట్టతల అయినా కూడా'' అంది. నాకు చిరాకనిపించింది. ''అన్నం పెట్టడమేమైనా వుందా లేదా'' అంటూ చిరాకుపడ్డాను.

మేము ముగ్గురం భోజనాలు కానిచ్చి నిద్రకుపక్రమించాం. నాకు మాగన్నుగా నిద్రపడుతున్న సమయంలో మా ఆవిడ ''ఉద్యోగాలలో ఉన్నంత కాలం యాంత్రిక జీవితంతో తలమునకలైపోయి సరదాలూ చట్టుబండలూ లేకుండానే కాలం గడిపేశారు. ఇక మీరు అలా వుంటానికి వీల్లేదు. ధారావాహికంగా వెలువడే సీరియల్స్‌లోని మనుషుల్లా మిమ్మల్ని నవయవ్వనం తొణికిసలాడే వ్యక్తిగా ఆకర్షణీయంగా వుండేలా మార్చేస్తాను. మీరు రిటైరైపోయారు. ఇహ నా మాట వినాల్సిందే. నే చెప్పినట్లు చెయ్యాల్సిందే. ఈ సీరియల్స్ చూడ్డంవల్ల అసలు జీవితం అంటే ఏంటి? మొగుడన్నవాడు ఎలా వుంటే అందంగా కనబడతాడు. ఆకర్షణీయంగా వుండాలంటే ఏం చెయ్యాలి అన్న విషయాల మీద నాకో అవగాహన ఏర్పడింది. రేపట్నించి నేను చెప్పినట్లు చెయ్యాల్సిందే'' అంటూ లెక్చరిచ్చింది. నాకు మంచి నిద్ర వస్తున్నట్లుంది. ఓసారి కళ్లు తెరిచి మా ఆవిడకేసి చూసి మళ్లీ కళ్లు మూసుకున్నాను.

మంచి నిద్రలో వున్నప్పుడు ఎవరో నన్ను లేవండి లేవండంటూ కుదుపుతున్నట్టనిపించింది. నేను కలేమో అనుకున్నాను. కానీ రెండు మూడు సార్లు గట్టిగా కుదపడంతో కళ్లు తెరిచాను. కలకాదు

''ఈ సీరియల్స్ చూడ్డంవల్ల అసలు జీవితం అంటే ఏంటి? మొగుడన్నవాడు ఎలా వుంటే అందంగా కనబడతాడు. ఆకర్షణీయంగా వుండాలంటే ఏం చెయ్యాలి అన్న విషయాల మీద నాకో అవగాహన ఏర్పడింది. రేపట్నించి నేను చెప్పినట్లు చెయ్యాల్సిందే''






పాడు కాదు. నా శ్రీమతి ఎదురుగా నిలబడి వుంది. ''లేవండి నాలుగ్గంటలు దాటింది. ఈరోజు నుంచి మీరు జిమ్‌కి వెళ్లాలి. మీరు నవమన్మధుడిలా కనబడాలి. వయసు తక్కువవారిగా మీరు అవ్వాలి. లేవండి... లేవండి'' అంది. నాకు చిరాకనిపించినా చేసేదేమీలేక సరేనంటూ జిమ్‌కి వెళ్లాను.

నేను ఇంటికి వచ్చేసరికి ఉదయం ఎనిమిదయింది. మా ఆవిడ కాఫీ కప్పు అందిస్తూ ''కాఫీ తాగింతర్వాత మంచి సెలూన్‌కి వెళ్ళి జుట్టుకి ఫ్యాషన్ కలర్స్ వేయించుకురండి. ఆ తర్వాత స్టీమ్ బాత్ చేద్దురుగాని. ఆఁ మర్చిపోయాను. వచ్చేటప్పుడు మేకప్ కిట్‌లోకి షేవింగ్ జెల్, ఆఫ్టర్‌షేవ్ బామ్, హెయిర్ స్టైలింగ్ జెల్ లాంటివి కొని తీసుకురండి'' అంటూ ఆర్డరేసింది.

''నేనంటే కోపమా'' అడిగాను.

''కోపమా... నాకెందుకు కోపం. కాకపోతే ప్రతి స్త్రీ తన భర్త నలుగురిలో అందంగా కనబడాలని కోరుకుంటుంది. ఉద్యోగంలో వున్నంతకాలం పొద్దున్నెప్పుడో వెళ్ళి రాత్రిళ్ళు ఆలస్యంగా రావడమే సరిపోయింది. ఇవన్నీ చేయడానికి సమయమెక్కడిది. అందుకనే ఇప్పుడు చేయమంటున్నాను. మామూలుగా ఉంటే ఎలా? చూడగానే ఆకట్టుకునేలా వుండాలి. ఇందులో తప్పేముంది. రోజుకి రెండు సార్లు ఏంటి సెప్టిక్ క్రీం రాసుకోండి. జుట్టుకి డై చేయించుకోండి. మీసాలకి డై లేకపోయినా ఫరవాలదు. దానికి ట్రూటోన్ బ్లాక్ హెయిర్‌డై స్టిక్ వాడండి. మీసాలు కూడా నల్లగా నిగనిగలాడుతూ కనబడతాయి. రోజూ మౌత్‌వాష్ వాడండి. దంతాలు గట్టిపడతాయి. లూజు కాకుండా వుంటాయి. రోజూ మంచి షాంపుతో తలస్నానం చేసి జుట్టు మెరిసిపోయే బిల్‌క్రీంలు రాయండి. మొహానికి మొదట ఫెయిర్‌నెస్ క్రీం పట్టించి ఆ తర్వాతే పౌడరు రాయండి. జీవితంలోని ఆనందమంటే ఏమిటో అప్పుడు తెలుస్తుంది. ఇవన్నీ చేసింతర్వాత మీరు మనింట్లో హీరోలా కనబడతారు'' అంది కళ్లు గుండ్రంగా తిప్పుతూ శ్రీమతి.

నెలరోజులు గడిచాయి. జేబులు ఖాళీ అవుతున్నా నాలో ఏదో శారీరకంగా మానసికంగా కొత్త ఉత్సాహం చోటుచేసుకున్నట్లనిపించింది. అప్పటివరకు మా కాలనీలో నాకేసి చూడనివాళ్లు కూడా నాకేసి చూడసాగారు. ఓరోజు సాయంత్రం జీన్స్ పాంటు, టీషర్టు వేసుకుని వెళ్తుంటే మా కాలనీలోని కొంతమంది అమ్మాయిలు 'వాట్ ఎ హాండ్‌సమ్' అనడం నాకు వినిపించింది. కొంతమంది అమ్మలక్కలు ''ఇదేంటి ఈ వయసులో ఇదే రోగం? రోమియోలా తయారయ్యాడు. జూలియట్ ఎక్కడుందో'' అని కిసుక్కుమనడం వినిపించింది. కొంతమంది ఆడవాళ్లు ''అంతా బాగుంది. క్యాప్ ఒక్కటే తక్కువైంది'' అని నవ్వుకున్నారు. మా ఎదురింటాయన పక్కింటాయన నన్ను చూసి ''ఇంత మేకప్ కొట్టుకుని కాలనీలో కాదు, నెక్లెస్‌రోడ్డులో తిరగాలి'' అంటూ నన్ను వేళాకోళం పట్టించారు. ముదిమికి ముచ్చట్లు లావు అని కొందరు నాకు వినబడేట్లు గొణుక్కున్నారు. ఏమయినా మా ఆవిడ పట్టుదల వీడలేదు. నాకు మేకప్ తిప్పలు తప్పలేదు.

మరో నెలరోజులు గడిచాయి. నేను రాత్రిళ్లు ఇంటికి లేటుగా రావడం గమనించిన మా ఆవిడ ఓరోజు ''ఏంటి మన కాలనీలో చాలామంది ఆడవాళ్లు మీ గురించే మాట్లాడుకుంటున్నారట. మీతో మాటలు కలపాలని ప్రయత్నం చేస్తున్నారట. నిజమేనా'' అంటూ నన్ను నిలదీసింది.

''అందులో తప్పేముంది. సరదాగా వాళ్లతో మాట్లాడుతుంటే నాకు సమయమే తెలియడం లేదు. అందుకు లేటవుతోంది. ఇందులో విడ్డూరమేముంది'' అన్నాను.

''మన కాలనీలో రోజీ అనే విడో వుంది. మీకు తెలుసా'' అడిగింది శ్రీమతి.

''తెలుసు. అయినా ఆ విషయం ఇప్పుడెందుకు?'' అన్నాను.

''మీ గెటప్ చూసి ఆవిడకి ఒళ్లు తెలియడం లేదని మన కాలనీలో ఆడవాళ్లు చెవులు కొరుక్కుంటున్నారు.''

''మంచిదేగా?'' అంటూ మా ఆవిడ వంక చూశాను. ఆవిడ గుర్రుగా నావేపు చూస్తోంది. కాసేపాగి ''నీకో విషయం తెలీదేమో'' అన్నాను.

''ఏంటది?''

''నీకే కాదు. నేను చాలామందికి హీరోలాగానే కనబడుతున్నాను. అంతేకాదు. నాకూ ఓ మంచి హీరోయిన్ దొరికింది'' అన్నాను.

అంతే. ఇహ మా ఆవిడ రుసరుసలూ విసవిసలూ చెప్పనక్కరలేదు. విసురుగా వెళ్లి మేకప్ కిట్, హెయిర్‌డై మొదలైనవన్నీ కిటికీలోంచి బయటకు విసిరేసింది.

''ఇక చాలు మేకప్ పురాణం. మళ్లీ ఆ జోలికి వెళ్లారంటే ఊరుకోను'' అంది ఆర్డరేసినట్లు.

'అమ్మయ్య, బతికించావు' అనుకున్నాను గొప్ప రిలీఫ్‌గా ఫీలవుతూ!